క్లుప్తంగా

లివిరిలో నామ సంకీర్తన



కీర్తనలు ఆలపిస్తున్న హరేరామ భక్తులు

భామిని: మండలంలోని లివిరిలో రాధాకృష్ణ మందిరంలో ఒడిశాకు చెందిన హరేరామ భక్తులు ఆదివారం నామసంకీర్తన చేశారు. డోలోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు చేపట్టడంతో ఆలయం భక్తులతో నిండిపోయింది. అనంతరం హరేరామ భక్తులు గ్రామంలో పర్యటించి కీర్తనలు ఆలపించారు.

అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: మున్సిపాలిటీలో మూడు అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. రోస్టర్ ప్రకారం, కాపుబొడ్డవలస ఎస్సీ, గొట్టాపువీధి ఓసీ, వెంకటేశ్వరకాలనీ-1బీసీ బీకి కేటాయించామని పేర్కొన్నారు. పైపోస్టులకు అర్హులైన అభ్యర్థినులు ప్రాజెక్టు కార్యాలయంలో ఈ నెల 31 సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తులు అందించాలని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి కుడి కాలువ పరిధిలోని మరుపెంట పరిసరాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ టి.రమేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం స్థానికులు ఇచ్చిన సమాచారంతో మరుపెంట పరిసరాలను పరిశీలించగా, 40 నుంచి 45 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి మృతదేహం కనిపించిందన్నారు. గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహం ఉందని, శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. ఆత్మహత్య లేకపోతే ఆయనను ఎవరైనా హత్య చేసి ఉంటారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శాశ్వత భూహక్కు కల్పించాలి

పార్వతీపురం రూరల్: గిరిజనులు సాగుచేస్తున్న భూములకు శాశ్వత భూహక్కు పత్రాలను మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని గంగాపురం పంచాయతీ తాన్నవలస గ్రామంలో గత 40ఏళ్లుగా గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. గిరిజనులు సాగుచేస్తున్న భూములకు సంబంధించి వ్యక్తిగతంగా పట్టాలు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ పట్టాలు మంజూరు చేయలేదన్నారు. గ్రామంలో రెవెన్యూ సదస్సుల్లో సాగు భూములకు దర్యాప్తు నిర్వహించినప్పటికీ ఇంతవరకు మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాన్నవల, తొక్కుడువలస గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి గిరిజనులు సాగు చేస్తున్న భూములకు శాశ్వత భూహక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు పి.రాము, ఎం. రాము, కె. చిరంజీవి, పి.వరాలు తదితరులు కోరారు.

ప్రారంభానికి సిద్ధంగా వాహన ఫిట్‌మెంట్ ఆఫీసు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర ప్రధాన రహదారిపై చినభోగిలి-కాశీపేట గ్రామాల మధ్య నిర్మాణం చేసిన వాహనాల ఫిట్మెంట్ సర్టిఫై జిల్లా కార్యాలయం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. చినభోగిలి రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ గుర్తింపు పొంది న రేపిడ్ ఇన్సూరెన్స్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించి ఫిట్మెంట్ సర్టిఫై చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో చినభోగిలి ఆటోమేటిక్ స్టేషన్ మీదుగా ఒడిశా, మధ్యప్రదేశ్, చెన్నై, కోల్‌కత్తా, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాంచల్, ఉత్తరప్రదేశ్, ఛండీగఢ్ రాష్ట్రాలకు చెందిన వాహనాలు రోజువారీ వందలాది కొత్త, పాతవి తిరుగాడుతుంటాయి. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖాధికారులు ఇక్కడినుంచే వాహనాలను తనిఖీలు చేసి ఫిట్మెంట్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. వాహనాలను తనిఖీ చేయాల్సిన యంత్రాలు, పనిముట్లు ఏర్పాటు చేశారు. అందుకు అవసరమైన మోటార్ వెహికల్స్ తనిఖీ అధికారులను నియమించారు.

● దిష్టిబొమ్మలా..



సీతంపేట మండలంలోని లాడ గ్రామంలో గతంలో రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించారు. అయితే దానికి మోటార్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో మంచినీటి సరఫరా జరగడం లేదు. దీంతో ట్యాంక్ దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామస్తులు సొంతంగా మంచినీటి ట్యాంక్ నిర్మించుకుని, దానికి పైప్‌లైన్లు వేసుకుని తాగునీరు పట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి రక్షిత మంచినీటి పథకానికి విద్యుత్ మోటార్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. - సీతంపేట

● తుంబకొండలో దంత వైద్యశిబిరం

సమాజ్ పరివర్తన్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని తుంబకొండ గ్రామంలో సూర్యకళ దంత వైద్యశాల వైద్యులు ఆదివారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటి సభ్యులు ఎస్.గణేష్, ఎ.చిన్నారి, ఎస్.సురేష్, తదితరులు పాల్గొన్నారు. - సీతంపేట



● కులగణన తర్వాతే వర్గీకరణ చేయాలి



కులగణన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేయాలని రాష్ట్ర రెల్లి కులాల జేఏసీ అధ్యక్షుడు గండి వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి గ్రామంలో ఆదివారం జరిగిన రెల్లి కులస్తుల సమావేశానికి హాజరైన ఆయన.. జిల్లాను ఒక యూనిట్‌గా చేసుకుని, వర్గీకరణ చేయాలని రెల్లి, దాని ఉపకులాలకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు వెలగాడ గురువులు కె.సుందర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. -జియ్యమ్మవలస రూరల్

పాలిటెక్నిక్ విద్యతో.. ఉజ్వల భవిత!



గుమ్మలక్ష్మీపురంలోని ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల

- గిరిజన విద్యార్థులకు అందుబాటులో గుమ్మలక్ష్మీపురంలో కళాశాల
- పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల
- దరఖాస్తులకు ఏప్రిల్ 15 ఆఖరు

గుమ్మలక్ష్మీపురం: సాంకేతికంగా ప్రపంచం దూసుకుపోతోంది. అదే పోటీ ప్రపంచాన్ని అందుకోవాలనే లక్ష్యంతో నేటి యువత కూడా ముందుకు వస్తున్నారు. అలాంటి వారి లక్ష్యం పాలిటెక్నిక్ విద్యతో సాకారమవుతుంది. గిరిజన విద్యార్థులు సైతం పాలిటెక్నిక్ విద్య పొందే విధంగా ఏజెన్సీ ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాల అందుబాటులో ఉంది. ఈ నెల 10వ తేదీ పాలిసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు గడువు ఉంది. ఏప్రిల్ 30వ తేదీన పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలనుకునే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100, బీసీ, ఓసీ విద్యార్థులు రూ.400 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

పదో తరగతి పాసైతే చాలు..

పదో తరగతి పాస్(ఉత్తీర్ణత) అయితే చాలు.. పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరవచ్చు. అయితే దీనికి పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా, పదో తరగతి తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు, ఈ ఏడాది టెన్త్ పరీక్ష రాసిన వారు కూడా ఈ పరీక్ష రాసుకోవచ్చు. పరీక్ష 120 మార్కులకు ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగానే ఈ పరీక్ష ప్రశ్నపత్రంలో ప్రశ్నలు ఉంటాయి.

పాలిటెక్నిక్ ప్రయోజనాలు..

- 18 ఏళ్ల వయసులోనే ఉద్యోగ జీవితంలో అడుగు పెట్టొచ్చు.
- తక్కువ ఫీజు, పాలిసెట్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి సదుపాయాలు ఉంటాయి.
- స్టైఫండ్‌తో కూడిన ఆరు నెలల పారిశ్రామిక శిక్షణ

స్వయం ఉపాధి అవకాశాలు..

పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ విద్యను అభ్యసిస్తే చిన్నవయసులోనే ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు ఉంటాయి. పాలిటెక్నిక్ పూర్తయిన తర్వాత ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరవచ్చు. లేదా ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు.

-ఎ.జగదీశ్వరరావు, ప్రిన్సిపాల్, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, గుమ్మలక్ష్మీపురం

అందుబాటులోని కోర్సులివే..

గుమ్మలక్ష్మీపురంలోని పాలిటెక్నిక్ కళాశాలలో డీఈఈఈ(డిప్లమో ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్), డీఎంఈ(డిప్లమో ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్) కోర్సులు కలవు.

షాడో పాలనపై డీఎల్‌పీఓ ఆరా..


సాక్షి
పాలన అస్తవ్యస్తం

ఈనెల 15న సాక్షిలో వచ్చిన కథనం



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రమాప్రసాదరావు

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలో షాడో పాలన జరుగుతోందని, పాలన అంతా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో నడుస్తున్న వైనంపై ఈ నెల 15న సాక్షిలో ప్రచురితమైన 'పాలన అస్తవ్యస్తం' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా పంచాయతీ అధికారి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ జె. రమాప్రసాదరావు ఆదివారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈఓ రవి సెలవులో ఉండడంతో ఈఓపీఆర్డీ రమణమూర్తిని, ఇన్‌చార్జ్ ఈఓ బి.కోటేశ్వరరావులతో మాట్లాడుతూ.. పంచాయతీ కార్యకలాపాలపై ఆరా తీశారు. ఇంటిపన్నుల వసూళ్లలో చాలా వెనుకబడి ఉన్నట్లు గమనించారు. గతంలో పనిచేసిన ఇద్దరు బిల్లు కలెక్టర్లకు బదిలీ జరగడంతో, వారు వసూలు చేసిన ఇంటి పన్నుల వివరాలు పూర్తి స్థాయిలో తెలియరాలేదని గుర్తించారు. ఇకపై పారిశుధ్య పరిరక్షణ, తాగునీటి పంపిణీపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు.

పక్కాగా వేలంపాట

మేజర్ పంచాయతీకి చెందిన షాపులను అద్దెకిచ్చేందుకు ఈ నెల 25న నిర్వహించనున్న వేలంపాటను పక్కాగా నిర్వహించాలని డీఎల్‌పీఓ జె.రమాప్రసాదరావు సూచించారు. వేలంపాటలో దళారుల ప్రమేయం లేకుండా చేసి పంచాయతీ ఆదాయాన్ని పెంచాలన్నారు.

● యువతకు స్ఫూర్తి..



విప్లవ వీరులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు యువతకు స్ఫూర్తి కావాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న అన్నారు. పట్టణంలోని గొల్లవీధిలో అమరవీరుల వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బుడితి అప్పలనాయుడు, గురుబుబిల్లి సూరయ్య, బొత్స మోహనరావు, భారతి, లెనిన్, తదితరులు పాల్గొన్నారు. - పాలకొండ

ఏకీకృత విధానం పాటించాలి

గుమ్మలక్ష్మీపురం: సీనియార్టీ జాబితా రూపకల్పనలో అన్ని జిల్లాలు ఏకీకృత విధానాలు పాటించేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణారావులు ఓ ప్రకటనలో ఆదివారం కోరారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలు రిజర్వేషన్ రోస్టర్ పాయింట్ల ప్రకారం రూపొందించినవని, బదిలీలకు రిజర్వేషన్లు వర్తించవు కనుక బదిలీలు కోరుకునే ఉపాధ్యాయులు ఆందోళన చెందవద్దన్నారు. బదిలీల్లో వ్యక్తిగతంగా ప్రిఫరెన్షియల్ కేటగిరీ, పనిచేసే పాఠశాల హెచ్ఆర్ఏ, పూర్తి సర్వీస్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పాయింట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. బదిలీల పాయింట్లు సమానంగా వస్తే అధిక వయసును బట్టి సీనియార్టీ నిర్ణయిస్తారని, వయసులు కూడా సమానమైతే మహిళలకు ప్రాధాన్యం ఇస్తారన్నారు. సెకండరీ గ్రేడ్ తత్సమాన కేడర్ల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన వారికి అలాగే డీఎస్సీ ద్వారా నేరుగా స్కూల్ అసిస్టెంట్లుగా నియమించబడిన వారికి మధ్య సీనియార్టీ రూపకల్పన కష్టతరమైనదని, వివిధ జిల్లాల విద్యాశాఖ అధికారులు సీనియార్టీ రూపొందించడంలో ఒకే నిర్దిష్టమైన నియమాలు అనుసరించకపోవడం వల్ల అనేక పొరపాట్లు జరుగుతున్నాయన్నారు. డీఎస్సీ ద్వారా వివిధ సబ్జెక్టులకు నేరుగా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్లలో ఎవరైనా మొదటి ర్యాంకు సాధించి ఆలస్యంగా ఉద్యోగంలో చేరితే ఆ సబ్జెక్టుకి చెందిన స్కూల్ అసిస్టెంట్లు మిగతా సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ల కన్నా జూనియర్లు అవుతున్నారని, దాన్ని కూడా రాష్ట్ర విద్యాశాఖ సరి చేయాలని విజ్ఞప్తి చేశారు. 2009 ఫిబ్రవరిలో వివిధ కేడర్లకు చెందిన స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు జరిగాయి కానీ ఒక్కో సబ్జెక్టుకు ఒక్కోరోజు పదోన్నతుల కౌన్సెలింగ్ చేపట్టారని, వారందరికీ కామన్‌గా 2009 ఫిబ్రవరి 2వ తేదీని తీసుకునేలా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు

సీతంపేట: నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఈ నెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రోడ్ల దుస్థితిపై ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

భామిని: మండలంలోని ఏబీ రోడ్డు అధ్వానంగా తయారైందని, ఈ రోడ్డుపై రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారని మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బాలేరు కూడలిలో ఏబీ రోడ్డుపై ఆర్టీసీ బస్సులను నిలిపివేసి ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఇంతవరకు పూడ్చలేదని మండిపడ్డారు. మండల పర్యటనలో భాగంగా ఇటీవల భామిని వచ్చిన కలెక్టర్ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అధ్వాన రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు పాడవుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కొత్తకోట మహేష్, కొత్తకోట శివాజీ, బిల్లింగి తిరుపతిరావు ఆధ్వర్యంలో యువత ఆందోళన చేపట్టారు. ఎంపీటీసీ సభ్యులు కె.చంద్రశేఖర్, సీపీఎం నాయకుడు కొండగొర్రి భాస్కరరావు యూత్‌కు మద్దతు తెలిపారు.

చింతపండు సేకరణలో బిజీబిజీ



చింతమానుకాలనీలో చింతబొట్టలు ఒలుస్తున్న కుటుంబ సభ్యులు

సీతంపేట: చింతపండు సేకరణలో గిరిజనులు బిజీబిజీగా ఉన్నారు. చింతచెట్ల నుంచి బొట్టలను దించేసి వాటిని ఒలిచే పనిలో ఇంటిల్లపాదీ ఉన్నారు. ప్రస్తుతం కిలో రూ.50 పైనే వారపు సంతల్లో విక్రయిస్తున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి తక్కువగా ఉండడంతో ధరలు పెరిగాయి. జీసీసీ మాత్రం కిలో రూ.36కు కొనుగోలు చేస్తామని మద్దతు ధర ప్రకటించినా ఎవ్వరూ విక్రయించడం లేదు. ప్రైవేట్ వ్యాపారులు, సాధారణ వినియోగదారులకు మాత్రమే అమ్మకాలు జరుపుతున్నారు. సీజన్ ఆఖరయ్యేసరికి కిలో చింతపండు రూ.60 వరకు పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

విత్తన గుళికలతో రైతుకు ప్రయోజనం

భామిని: విత్తన గుళికలతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ప్రకృతి సాగు సిబ్బంది అన్నారు. నులకజోడు ఎంపీటీసీ సభ్యుడు బూస బాలకృష్ణ పర్యవేక్షణలో బిల్లుమడ, నులకజోడులో విత్తన గుళికల తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తన గుళికల వల్ల పంటకు తెగుళ్లు సోకవన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ వలరౌతు ప్రభాకరరావు, కె.సంధ్య, జి.రాంబాబు, అరుణ, రైతులు పాల్గొన్నారు.



విత్తన గుళికల తయారీని పరిశీలిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు బూస బాలకృష్ణ

సేవా కార్యక్రమాలతో ఆదర్శం..

- శ్రమదానం చేపట్టిన యువత
- వంతెనపై పేరుకుపోయిన చెత్త తొలగింపు



బ్రిడ్జిపై చెత్త ఏరుతున్న ముచ్చర్లవీధి యువత



యువతను అభినందిస్తున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: మేజర్ పంచాయతీలోని ముచ్చర్లవీధికి చెందిన యువకులు తాము చేపడుతున్న సేవా కార్యక్రమాలతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరఘట్టం వట్టిగెడ్డ వంతెనపై చాలా కాలంగా పేరుకుపోయిన చెత్తను సుమారు 30 మంది యువత ఆదివారం తొలగించారు. ఆర్అండ్‌బీ అధికారుల పరిధిలో ఉన్న ఈ వంతెనపై చాలా కాలంగా ఉన్న చెత్తను తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ స్పందించలేదు. వీరఘట్టం సమీపంలో ఉన్న ఈ వంతెన నడుకూరు రెవెన్యూ పరిధిలో ఉండడంతో ఈ రెండు పంచాయతీలు కూడా వంతెనపై పారిశుధ్య పనులు చేపట్టడం లేదు. దీంతో యువత ముందుకు వచ్చి సుమారు 500 మీటర్ల పొడవున్న వంతెనపై రెండు అడుగుల ఎత్తులో పేరుకుపోయిన మట్టిని తొలగించారు. అటుగా వెళ్తున్న ఎంపీడీపీ బి. వెంకటరమణ, ఎస్సై జి. కళాధర్ యువత శ్రమదానం చేయడాన్ని చూసి అభినందించారు.

ఆదర్శంగా నిలుస్తున్నారు....

ముచ్చర్లవీధిలో వివిధ మతాల వారు ఉన్నప్పటికీ, యువత ఐకమత్యంతో ఉంటున్నారు. వినాయక చవితి రోజుల్లో చేపట్టే కుంకుమ పూజల్లో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అనే తేడా లేకుండా అందరూ పాల్గొనడంలో యువత కృషి దాగి ఉంది. అలాగే ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుంటారు. రెండు వారాల కిందట వీధిలో అద్దెకు ఉంటున్న ఓ కుటుంబంలో మహిళ గుండెపోటుతో మృతి చెందింది. వారి కుటుంబ సభ్యులు ఒడిశా రాష్ట్రంలో ఉండడంతో వారు వచ్చేలోపు అన్ని ఏర్పాట్లు చేయడం, పెద్ద కర్మ కూడా దగ్గరుండి జరిపించారు. అలాగే ఎన్నో సేవా కార్యక్రమాలతో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



వీరఘట్టం: ఉల్లాస్ పరీక్ష రాస్తున్న మహిళలు



జియ్యమ్మవలసలో పరీక్ష రాస్తున్న మహిళలు



సీతంపేట: ఉల్లాస్ పరీక్ష తీరును పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ గీతాంజలి

● 'ఉల్లాస్'ంగా పరీక్ష

గ్రామ గ్రామాన ఉల్లాస్(అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పరీక్ష ఆదివారం జరిగింది. అంగన్‌వాడీ కార్యకర్తల పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షకు మహిళలంతా ఎంతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా హాజరై, అక్షరాస్యత అర్హత పరీక్ష రాశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులను చేయడమే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమం పేరిట మహిళలకు విద్య నేర్పించారు. అనంతరం ఈ పరీక్ష చేపట్టారు. -పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



గరుగుబిల్లిలో పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు సూచనలిస్తున్న వయోజన విద్య ఏడీ వైకుంఠరావు